



భమిడి వెంకటేశ్వర్లు

**ఉద్యోగంనుంచి** రిటైరయి రెండేళ్ళయినా ఉద్యోగంలో చేరక ముందు అలవాటయిన పని ఉద్యోగం అయాకకూడా కొనసాగుతూంది. పొద్దున్నే లేచి వేణ్ణీళ్లకు కొబ్బరి డొక్కలతో గాడిపొయ్యి అంటించటం, పాలవాడు రాగానే పాలు పోయించుకుని, రెండు కుంపట్లు అంటించటం ఒకటి పాలు కాచేందుకు, రెండోది కాఫీకి నీళ్ళు కాచేందుకు. ఆ తరవాత దంతధావనం, కాల కృత్యాల పేరుతో "కోడు"కు వెళ్ళటం.

మా వూరు ఇప్పటికీ చిన్న పల్లెటూరు. వూర్లో వాళ్ళకి "కోడు" బహిర్దేశ ప్రదేశంగా ఉపయోగ పడుతుంది.

ఇంటికి రాగానే అనూరాధని లేపుతాను. ఆమె అంటే నా కెంతో ప్రేమ. అభిమానం. మా ఇద్దరికీ పంతొమ్మిదేళ్ళ కిందట పెళ్ళి చేశారు పెద్దలు.




మేము నలుగురు కొడుకులకీ, అయిదుగురు కూతుళ్ళకీ తల్లి దండ్రు లయ్యాం. నేను బడి పంతులుగా పని చేసినన్నాళ్ళూ ఏ అధికారికీ నా విధి నిర్వహణలో లోటు పాట్లు చూడ నివ్వలేదు. నా విద్యార్థులు ఎంతోమంది దేశంలో గొప్ప గొప్ప ఉద్యోగాలు చేస్తున్నారు. ఆ తృప్తి, ఆనందం తరచు గుర్తు కొస్తూ ఉంటుంది.

అనూరాధకి "కాఫీ అయింది. ఇక లే" అంటే కాని నిద్ర మెలకువ రాదు. ఒక విధంగా నేనే ఆ అలవాటు చేశాను కాబట్టి తనను తప్పు పట్ట కూడదు.

తను లేచాక నేను చెరువుకు స్నానానికి వెడతాను. తడి పంచెతో ఇంటి కొచ్చి పట్టు పంచె కట్టుకుని గీతాపారాయణం చేస్తాను ఒక అరగంట సేపు. సంధ్యావందనం చెరువు దగ్గరే ముగిస్తాను.

రిటైరయ్యే నాటికి ముగ్గురు కూతుళ్ళకీ, ముగ్గురు కొడుకులకు వివాహాలు చేశాను. పెద్దవాడు హైదరాబాదు, రెండోవాడు విశాఖపట్నం, మూడో వాడు విజయవాడలోను ఉద్యోగాలు చేస్తున్నారు. పోతే నాలుగో వాడు శివశంకరం ఏడాది క్రితమే రాజమండ్రీ పేపరు మిల్లులో టైపిస్టుగా చేరాడు.

ఆఖరివాడు దగ్గిరలో ఉన్నాడన్న సంతోషం మాత్రమే మా కుంది. వాడంటే నా కెంతో గారం ఏర్పడింది మొదటినుంచీ! ఆఖరి ఆడపిల్ల లిద్దరూ ప్రస్తుతం అమలాపురం కాలేజీలో చదువు తున్నారు.

మా వూర్లో భవనం ఉంది. అది పంచాయతీ గ్రంథాలయం. ఎనిమిది గంటల కల్లా ఫస్టు బస్సు రాజమండ్రి నుంచి వస్తుంది.. అందులో పత్రికలు వస్తాయి. ఆ టైముకి నేను భవనం చేరు కుంటాను. మా వూర్లో పత్రిక చదివే మొదటి పాఠకుడిని నేనే!

పేపరులో నా కళ్ళు అప్రయత్నంగా రంగులు, పార్టీలు మార్చే రాజకీయాల నాయకుల వైపు, శాంతి భద్రతలు, దోపిడీలు. దొంగతనాలు. మాన భంగాలు, మంత్రుల విదేశీ పర్యటనలు, ప్రజ లకు చేసే కల్ల బొల్లి వాగ్దానాల వైపు మళ్ళు తాయి.

ఆ విషయాలు చదివినప్పుడల్లా "ఈ దేశం బాగుపడేందుకు ఇంకా ఎన్నేళ్ళు పడుతుందో?" అనిపిస్తూ ఉంటుంది.

● ● ● ●

శంకరానికి మూడు నెలల క్రితం వివాహం చేశాం. శకుంతల వాడి భార్య. ఆమె వచ్చాక ఇంటి పనిలో నాకు కొంత శ్రమ తగ్గింది. అనూరాధకు ముగ్గురు కోడళ్ళ మీద అత్తగారి పెత్తనం చెలాయించడానికి కుదరలేదు. కాబట్టి శకుంతల మీద తన సరదా తీర్చుకునేందుకు ప్రయత్నించ సాగింది.

శకుంతల తండ్రి అవధానులు. ఆయనకూడా నా లాగే బడి పంతులుగా రిటైరయ్యాడు అయిదేళ్ళ క్రితం.

అవధానులు శంకరాన్ని పాతిక వేలకు కొనుక్కు న్నాడు. కాని అయిదు వేలు బేరంలో బాకీ ఉండ టంతో అనూరాధ మాంగల్యధారణకు అంగీక రించినా 'శోభనం' కు ఒప్పు కోలేకపోయింది.

"అలా అంటే ఎలా చెప్పండి. నాలుగైదు నెలల్లో ఇచ్చేస్తాను." అవధానులు ప్రాథేయపడ్డాడు శ్రీమతిని. సాటి మగవాడిని నేను ఆదుకోలేక పోయాను. నేనుకూడా ముగ్గురు కూతుళ్ళకి పెళ్ళిళ్ళు చేశాను. ఆఫ్‌కోర్స్, అంతంత కట్నాలు ఇవ్వలేదు కాని, బాగానే పుచ్చుకున్నాను. నేనుకూడా కొన్ని తగ్గింపులు, మినహాయింపులుచేసినా, అనూరాధ మాత్రం తెలివిగా చాకచక్యంగా వాటిని పైకి తీసుకు రానీయలేదు.

అప్పుడు శ్రీమతిలోని మానవత్వం సాటి ఆడ దానిమీద జాలి చూపెట్టింది. శోభనంకు అంగీక రించింది. కాని, అంతవరకూ కోడలు తనతోనే కాపరం చేస్తుందన్న షరతు పెట్టేసరికి అవధానులు మాట్లాడలేకపోయాడు.

ఆ రోజుకూడా దినచర్యగా గాడిపొయ్యి వెలిగించ బోతుంటే వచ్చింది శకుంతల కళ్ళు నులుము కుంటూ.

"మీ కెందుకు మామయ్యా. ఈ శ్రమ. నేనున్నాను కదా!" నా చేతిలోని నీళ్ళ కాగు తీసు కుంటూ అంది తను.

ఆ మాట నా కెందుకో కొత్తగా ధ్వనించింది. నా జీవితంలో ఎప్పుడూ వినిపించని ఆ మాట ఎంతో ఉల్లాసాన్ని కలిగించింది.

"పోనీలేమ్మా. ఇందులో కష్టపడేదీ ముంది. అలవాటయినా పనేగా" అన్నాను. నిజానికి మీ అత్తగారు గుర్తించక పోయినా, నువ్వైనా ఆ మాట అన్నావు. చాలా సంతోషం." అని అనాలను కున్నాను.

మామూలుగానే చెరువుకు వెళ్ళి పోయాను. ఇంట్లోకి అడుగు పెడుతుంటే లోపలనుంచి అనూరాధ మాటలు వినపడ్డాయి.

"ఏమే శకుంతలా! ఏరీ ఆయన. ఇంకా చెరువు నుండి వూడి పడలేదా. ఇంటి కొచ్చి భవనంకు షికారు, పేపరు పఠనం. ఇంట్లోకి కూరలు తేవాలన్న జ్ఞానం, ఆలోచన ఆ మనిషికి ఉండ దేమో! రోజూ గుర్తు చేయాలి. కూరలు తేవాలి. వంట చేయాలి. పిల్లలు భోజనం చేయాలి. బస్సుకు వెళ్ళాలి. ఇదంతా అయేసరికి, ఆ తొమ్మిది గంటల బస్సు కాస్తా వెళ్ళి పోతుంది. బొత్తిగా ఏమీ పట్టించుకోరు."

"నేను తెస్తాను లెండి "అంటూంది శకుంతల. సంచీ, డబ్బు తీసుకుని తను తాత కూరల కొట్టుకు బయలుదేరింది రావి చెట్టు దగ్గరకు.

మా వూరికి తాత కూరల దుకాణం పెద్ద డిపార్టుమెంటల్ షాపు. అక్కడ ఏ సమయంలో అయినా కూరలుంటాయి. తన పొలంలో పండిన కూరలు, ఆకుకూరలు ఇక్కడికి తెచ్చి అమ్ముతూం టాడు. ధర, తూకంలో చాలా నిజాయితీ. చిన్న పిల్ల వెళ్ళినా మోసం, దగా చేయడు.

● ● ● ●

"సంక్రాంతికి రమ్మనమని అబ్బాయిలకు, అల్లు ళ్ళకు ఉత్తరం రాయండి" అంది అనూరాధ.

"ఏ పిచ్చి కాని—వాళ్ళు ఎలా వస్తారు? బోలెడన్ని దారి ఖర్చులవుతాయి. సెలవు లుండద్దూ. పైగా ఇంతమందికి నువ్వేం చేయగలవు? పైగా శకుంతల పుట్టింటికెడుతుందేమో గదా" అన్నాను. ఆ మాట లకు నా వైపు చురచురా చూసింది తను.

"ఏం. అవధానులు మీకు కట్నం బాకీ తెచ్చి ఇచ్చాడా? అయినా ఇందులో చేసేదేముంది." అనూ రాధ అంది.

అనూరాధకు వంట మనిషిని పెట్టటం ఇష్టం ఉండదు. శకుంతలను పంపదని నాకు తెలుసు. నా కెటూ ఇంట్లో అధికారం, అజమాయిషీ లేదని తెలుసు. అయినా శ్రీమతి ఏమంటుందోనని ఒక విసురు వేశాను. నా కొడుకులకు రావాలని ఉన్నా, కోడళ్ళు సాగనివ్వరు. కారణం అనూరాధ. కూతుళ్ళకి మూటయాభై పెట్టి చీరలు పెడుతుంది. కోడళ్ళకు ఏభై రూపాయ లిస్తుంది. అల్లుళ్ళకుడెబ్బై అయిదు, పిల్లలకు తలో పది. కోడళ్ళు అదివరకే ఆ మాట లన్నారు. అందుకే పిలవడం దేనికి అన్నాను.

కాని అనూరాధ చెప్పినట్లుగా ,ఉత్తరం రాయ టం మానలేదు. ఆ రోజు అవధానులుకూడా వచ్చి చెప్పాడు. శకుంతలని, శంకరాన్ని పండగలకు పంపించమ.ని కాని, అనూరాధా నిర్మొహమాటంగా కోడలుని పంపేది లేదని చెప్పేసింది—బాకీ విషయం గుర్తు చేస్తూ.

తల్లి చేసిన పనికి నిరసనగా శంకరం ఉత్తరం రాశాడు.

"అమ్మా! ఇది అన్యాయం, పక్షపాత వైఖరి ను వ్వెందుకు మార్చుకోలేకపోతున్నావో తెలియటం లేదు. శకుంతలని నాతో కాపరానికి పంపించక పోయినా కనీసం పండగలకు పంపిస్తే ఏం పోతుంది? నీ ఇంట్లో జనానికి వంటలక్కగా పని చేయాల్సిందేనా తను? నీ కూతుళ్ళెప్పుడైనా అత్తవారిళ్ళకు వెళ్ళటం గుర్తుందా నీకు? కనీసం ఏ కూతురైనా నీకు ఆపరేషను చేసినప్పుడు చూసేందుకువచ్చిందా?" అంటూ.

ఉత్తరం చదివాక అనూరాధ—'కుర్ర వెధవ వాడికేం తెలుసు. అయినా వాడికి ఉత్తరంలో ఇలా రాసే ధైర్యం ఎలా వచ్చింది?' అనుకుంది.

అనుకున్నట్లుగానే పండగలకు అందరూ వచ్చేశారు. ఇల్లు విజయవాడ ప్లాట్ ఫారంలా ఉంది. కొడుకులు,అల్లుళ్ళు చతుర్ముఖ పారాయణం. కోడళ్ళు, కూతుళ్ళూ తమ తమ బంధువులు, స్నేహితుల ఇళ్ళకు తిరగటం. నాకు చెరువు, భవనం మధ్య తిరగటం. వంటింట్లో అనూరాధ, శకుంతల చాకిరీ. పండగలు ఇట్టే గడిచిపోయాయి.

ఈ లోకంలో ఆడపిల్లగా పుట్టటం అటు కన్నవారికి, ఇటు భర్తకు, అత్తవారికి చిన్నచూపే! తన వదినలు ఏమంత కట్నాలు తెచ్చారని? అందుకు తన తల్లి ఇలాగే ప్రవర్తించిందా? ఏమిటో, బొత్తిగా సంస్కారహీనంగా ప్రవర్తిస్తున్నారు? శకుంతల ఆలోచనలు, చూపులు నాకు అర్థమయ్యాయి.

• • • •

ఆ పది రోజులు విపరీతంగా చాకిరీ చేసినందు కేమో శకుంతల నాలుగు రోజులు మంచం దిగలేదు జ్వరంతో. ఆచార్లుగారు మా వూళ్ళో కేటలాగు డాక్టరు. ఆయనే మందిచ్చాడు. వారం రోజులకు కోలుకుంది తను.

ఆ మాత్రం దానికే అనూరాధ సణుగుడు. ఆ పిల్ల వూరికే పడుక్కుందా? అర్థం చేసుకో దెందుకు?


సాయంత్రం అవధానులు వచ్చాడు శకుంతలను చూసేందుకు.

"ఈ మధ్యనే తీర్థయాత్రలు చేసివచ్చాం. సంతర్పణ కార్యక్రమం ఏర్పాటు చేశాం. మీ రంతా రావాలని కోరుతున్నాను" చెప్పాడు అవధానులు.

"ఈ పెద్దమనిషికి కూతురు కాపరం చేయడం ఇష్టం లేదేమో? తీర్థయాత్రలు, సంతర్పణలు అంటూ డబ్బు ఖర్చు. బాకీ డబ్బు ఇవ్వటం మరిచి పోయాడు." అనూరాధ ఆయన వెళ్ళాక అంది నాతో.

కాని నేను తనని ఒప్పించి, శకుంతలను తీసుకుని వెళ్ళి సాయంత్రానికి తిరిగొచ్చాను. ఈ మాత్రానికే అవధానులు దంపతులు ఎంతో సంతోషించారు.

ఒక రోజు అనూరాధ ప్రసన్నంగా ఉన్నప్పుడు చెప్పాను. "ఒక విషయం తెలుసా నీకు! ఆఫీసుల్లో, ఫాక్టరీల్లో పనిచేసే కార్మికులకు, ఉద్యోగులకు, వారానికో రోజు సెలవుంటుంది. కోర్టులకు వేసవి సెలవు లుంటాయి. ఎందుకంటావ్—విశ్రాంతి పొందేందుకు."




అనూరాధకు ఆ మాటలు అర్థం కాలేదు.

"పాపం ఆ పిల్ల. అదే కోడలు పిల్ల. ఇరవై ఏళ్ళైనా నిండలేదు కదా. నువ్వు లేవక ముందే లేచి ఇంటి పనంతా విసుగు విరామం లేకుండా చేస్తోంది. ఎప్పుడైనా చేయనని ఎదురుతిరిగిందా? అమ్మాయిలతో పాటు సినిమాల కెళ్ళటం లేదు. పుట్టింటికి రెండు రూపాయల టిక్కెట్టుతో వెళ్ళచ్చు. కాని వెడుతూందా? ఇలా చేయటం బాగా లేదు. కాబట్టి ఒక పని చేస్తే బాగుంటుంది" అన్నాను అర్థమయ్యేట్టులా.

ఇంతకీ మీరు చెప్పేది ఏమిటి? అన్నట్లు చూసింది అనూరాధ.

"అంబాజీపేటలో వాళ్ళ బాబాయిగారు, వాళ్ళూ ఉన్నారు కదా. పైగా బస్సు దిగి పదడుగులువేస్తే చాలు. వారం కోసారి, ఆదివారం నాడు శకుంతలని అక్కడికి పంపిస్తే బాగుంటుంది. ఎటూ ఆదివారం పిల్లలకు కాలేజీ ఉండదు. హైరాన పడుతూ నువ్వు శ్రమ పడక్కర్లేదు. ఏమంటావ్?" అన్నాను.

"ఇదా మీరు చెప్పేది. ఈమాత్రం దానికింత ఉపన్యాసం దేనికో? ఆవిడగారు మీ దగ్గర చెప్పిందా? అలాగే వెళ్ళమనండి. అక్కడికి నేను వద్దన్నట్లు ... మీరే వెళ్ళమన్నట్టు ... అనుకోవటం దేనికి!" అంది అనూరాధ.

శ్రీమతి ఉద్దేశం నాకు తెలుసు. హడావిడిగా వంటా వార్పూ చేయక్కర్లేదు. భోజనానికి తొందర లేదు. పిల్లలు అవసరమయితే చేస్తారు. సాయంత్రం ఎటూ శకుంతల వచ్చేస్తుంది అని.

శకుంతల ప్రతి ఆదివారం ఉదయం ఎనిమిది గంటల బస్సుకెళ్ళి, సాయంత్రం ఆరు గంటలకు వస్తోంది. ఆ విధంగా మూడు నెలలు గడిచాయి.

• • • •

ఒక రోజు పొద్దున్నే నేను లేచేసరికి శకుంతల నీళ్ళకుండీ దగ్గర వాంతి చేసుకుంటోంది. ఆమె దగ్గర కెళ్ళి అడిగాను—

"ఏమ్మా ... ఎలా ఉంది. రాత్రి అన్నం జీర్ణం కాలేదా?"

తను మాట్లాడకపోయేసరికి అనూరాధని లేపేం దుకు కదిలాను. కాని అప్పటికే తను గుమ్మం దగ్గర నిలబడి ఈ దృశ్యాన్ని అయిదు నిముషాల నుంచి గమనించి ఉంటుంది.

శ్రీమతిలో ఏదో ఆలోచన చోటుచేసుకుంది.

కోడలు ఈ మధ్య దూరం అయినట్లు లేదు. తన కెప్పుడూ ఆలస్యం కాదు. ఏమై ఉంటుంది? అందులో ఈ మధ్య అంబాజీ పేట వెళ్ళివస్తోంది. అక్కడ ఎవరినైనా మరిగిందేమో? ఆ వెర్రి బాగులాయన ఒకందుకు పంపిస్తుంటే ఈ మహాతల్లి ఈ విధంగా ఉపయోగించుకుందేమో?

కోడలిని చాలాసేపు ప్రశ్నించింది అనూరాధ. తనకేమీ తెలియదని మొత్తుకుంది శకుంతల. ఆమె మీద చేయి చేసుకోబోయింది. శ్రీమతిని వారించి లోపలికి తీసుకువచ్చాను.

"నీకేమైనా జ్ఞానం ఉందా? అలాగేనా విషయం తెలుసుకోడం. ఇప్పుడా పిల్ల ఏ అఘాయిత్యం చేసినా ముందర పోలీసులు మనల్ని అరెస్టుచేస్తారు. ఇటువంటప్పుడు తెలివిగా, లౌక్యంగా ప్రవర్తించాలి" అన్నాను.

మధ్యాహ్నం శకుంతలని తీసుకుని అంబాజీపేట వెళ్ళింది అనూరాధ. కోడలు గర్భవతి అన్న విష యాన్ని నిర్ధారణచేసింది డాక్టరు పరీక్షచేసి. దాంతో తను మరింత మండి పడింది. ఇదెలా సాధ్యం? శంకరం శోభనం తర్వాత మళ్ళీ శకుంతలతో గడపలేదు. ఈ విషయం వాడికి తెలిస్తే? ఇందులో అనుమానం లేదు. పేటలో ఏదో భాగోతం నడుపుతోంది ఈ మహాతల్లి. ఇది బయట పడకుండా ఏదో ఒకటి చేయాలి? అనుకొంది అనూరాధ.

• • • •

రెండు రోజుల తరవాత అవధానులు వచ్చాడు. ఆయన చేతిలో శుభలేఖ లున్నాయి.

"రాజోలు ఆనందేశ్వరాలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన, నవగ్రహ శాంతి మహోత్సవం ఏర్పాటు చేస్తున్నాం. ఈ కార్యక్రమం నా చేతుల మీదుగా జరుగుతోంది. వూర్లో సంతర్పణ కూడా జరిపి స్తున్నాం. మీరంతా ఈ కార్యక్రమానికి రావాలని అర్థిస్తున్నాను" అన్నా డాయన శుభలేఖ ఇస్తూ.

"మరోలా భావించకండి, అన్నయ్యగారూ! మా రెండో అమ్మాయి పురిటికి వచ్చింది. ప్రస్తుతం పురిటి రోజులు. మీ బావగారు మగ దిక్కుగా ఉండాలి కదా ... పోనీ కోడలునైనా పంపిద్దా మంటే నేను బాలింతరాలు దగ్గిరుంటే ఇంట్లో పని పాటులు చేసేందుకు ఎవరున్నారు చెప్పండి? అందుకని

రాలేకపోతే మరోలా భావించవద్దని ప్రార్థన ..."
లౌకికంగా చెప్పింది శ్రీమతి.

"మీ బాకీ సొమ్ము మరో నెలలో ఇవ్వగలను."
అనూరాధ ఉద్దేశం గ్రహించి చెప్పా డాయన.

శకుంతలను చూసే అవకాశం ఆయనకు కలగ లేదు. కాని తాను చేయగలిగిందేమీ లేకపోవటంతో నిస్పృహాయంగా వెళ్ళిపోయాడు, గత్యంతరంలేక. ఆయనకు కూతురు శ్రేయస్సే కావాలనిపించింది. అందుకే మరేమీ అనలేకపోయాడు.

"చూశారా మీ వియ్యంకుడి ఘనకార్యం?" అంది శ్రీమతి హేళనగా.

"చూడు, అనూరాధా! ఆయన మనకేమైనా బాకీ ఉన్నాడా, మాట్లాడే ముందర కట్నం విషయం ప్రస్తావిస్తావు దేనికి? మనం ఆ శుభ కార్యానికి హాజరు కావాలి. డబ్బున్న వాళ్ళుకూడా చేయలేరు ఇటువంటి దైవకార్యం! ఆ దేవుడి దయ వల్ల మన కింత ఐశ్వర్యం ఉంది. ఆ దేవుడికి ఏమైనా చేయగలిగామా? చేసే శక్తి చేతులకున్నా, చూసే అదృష్టం కళ్ళు నోచుకోవాలి. మంచి మనసుండాలి. మనం వెళ్ళి చూసి వద్దాం." నా అభిప్రాయాన్ని తెలిపాను.

అంతే, అనూరాధ కోపంతో మండిపడింది.

"ఇప్పుడు మీ కోడలు గర్భవతి! ఆ గండం నించి గట్టెక్కే మార్గం ఆలోచించండి. ఎటువంటి అప్రతిష్ఠ! మన ఇంటా వంటా లేదు. ఈ వూరి చరిత్రలోనే ఎవరూ ఎరుగరు! అటువంటిది తాను సృష్టించింది. గుట్టుగా అంబాజీపేట తీసుకువెళ్ళి ఆ గర్భం తొలగించే మార్గం శంకరానికి తెలియకుండా చేయిద్దాం. వాడికి తెలిస్తే, మనల్ని నరికి, పోగులు పెడతాడు—మన పెద్దరికం ఇలా ముత్యంలా వెలిగిపోతోందని! శుభకార్యం సంగతి దేవుడెరుగు!" ఆవేశంలో ఏమందో తనకే తెలియదు.

గదిలో ఉన్న శకుంతలకు ఈ మాటలు వినిపిస్తూనే ఉన్నాయి. అసలు ఈ వారం రోజులనుంచి బయటికే రావటం లేదు. పనిపాటల సంగతి ఎలా ఉన్నా, తిండి తిప్పలు లేక మనిషి అస్థిపంజరంలా అయింది. ముఖంలో ఆకర్షణ తగ్గింది.

ఈ సమయంలో అనూరాధతో ఏం మాట్లాడినా వినిపించుకోదు. అందుకే భవనం వైపు వెళ్ళిపోయాను.

అవధానులు తలపెట్టిన దైవకార్యం నిర్విఘ్నంగా జరిగిపోయింది. కనీసం కూతురు, అల్లుడు వస్తారని ఆశించాడు కాని నిరాశే మిగిలింది ఆ దంపతులకు.


మరో పది రోజుల తరవాత —

మామూలుగానే పొద్దున్నే లేచాను. కాని ఆ రోజు నాకన్నా ముందరే అనూరాధ లేచింది. చెరువుకు బయలుదేరుతుంటే గాభరగా పరుగెట్టుకొచ్చింది తను నా దగ్గరికి.

"ఏమండీ! శకుంతల కనబడటం లేదండీ!" అంది.

"నీ మొహం—కనబడకపోవటానికి అదేమయినా నల్లపూస అనుకున్నావా?"

"అంతా వెదికానండీ... ఎక్కడా కనిపించలేదు.



ఫోటో: ఎం. శివశంకరయ్య

తను ఏ అఘాయిత్యం చేసిందోనండీ! వారం తిరక్కుండా రెండో దుర్ఘటన ఇదవుతుందేమో!" అనూరాధ కంఠంలో వణుకు, కళ్ళల్లో భయం స్పష్టంగా కనబడింది నాకు.

మావూర్లో వారం క్రితం హిందీ మేస్టారు కోడలు మొదట్లో కనిపించలేదు. ఆ తరవాత ఆమె శవం కొడు దగ్గరున్న దిగుడు బావిలో కనిపించింది. అత్తాకోడళ్ళ దెబ్బలాట అలా దారితీసింది.

"ఎక్కడికి వెడుతుంది... సరిగ్గా చూడు" అంటూ చెరువుకు బయలుదేరాను.

నేను చెరువునుంచి రాగానే అవధానులు వచ్చాడుట. కట్నం సొమ్ము అయిదువేలు అనూరాధ కిచ్చేశాడు. శకుంతలని, నన్ను కలుసుకునే అవకాశం లేక తొందరగా వెళ్ళిపోయాడుట. ఇదంతా నేను భవనం దగ్గిరికెళ్ళినప్పుడు జరిగిన విషయం. భోజనం వడ్డిస్తూ అనూరాధ చెప్పిన మాటలతో, నాకు అన్నం తిన బుద్ధికాలేదు. ఏం మాట్లాడానో నాకే తెలియదు.

"అనురాధా! నీ కేమైనా బుద్ధి, జ్ఞానం ఉందా? కట్నం బాకీ కోసం ఇలా ఆయనని బాధపెట్టడం మంచిది కాదు. ఈ సమయంలో ఆ డబ్బు ఎందుకు తీసుకున్నావ్? ఇదంతా అవధానులుకు తెలిసే ఉంటుంది. ఏదో హడావిడి నటించి ఉంటాడు నీ దగ్గిర. బహుశా ఆయన పోలీసులకు రిపోర్టు చేసేందుకే తొందరగా వెళ్ళిపోయి ఉంటాడు, పోలీసులు రంగ ప్రవేశం చేసి, విషయం బైట పెడతారు. అప్పుడు మనిద్దరం జైల్లో కూర్చుని, జైలు గోడలు చూస్తూ ఆనందించవచ్చు. ఛీ ఛీ ... పెళ్ళివ్వాలు ఎందుకు? భర్తతో కాపురం చేయ వలసిన పిల్లను అనుమానించావ్!"

అనూరాధ ముఖం పాలిపోయింది. ముఖంలో పశ్చాత్తాపం గుర్తించాను. ఇప్పుడు తనని ఓదార్చాలి.

"ను వ్వనవసరంగా దిగులు పడకు. నేను వూర్లోకి వెళ్ళి విచారణ చేసి వస్తాను. అంతగా అవధానులు పోలీసు రిపోర్టు ఇచ్చి ఉంటే, నేనేదో సర్దుబాటు చేస్తాలే! నువ్వు నిశ్చింతగా ఉండు" రోడ్డు మీదకు వెడుతూ అన్నాను.

శ్రీమతి కళ్ళ ముందర పత్రికలు ప్రచురిస్తున్న కోడళ్ళ ఆత్మహత్యలు, అత్తా కోడళ్ళ దెబ్బలాటలు సినిమా రీళ్ళల్లా కదలసాగాయి. తను ఎంతో భయపడిపోతోంది, ఏ సమయానికి ఏ వార్త వినవలసి వస్తుందా నని. శకుంతల ఏ అఘాయిత్యానికి పాలుపడకుండా ఉంటే చాలు— అనేక దేవుళ్ళకు మనసులోనే మొక్కుకుంది.

నాలుగు రోజులు దుర్భరంగా గడిపింది అనూరాధ.

అయిదో రోజు సాయంత్రం మా వూరి హైస్కూలు హెడ్మాస్టరుగారి కొడుకు చెప్పిన విషయాన్ని చెప్పింది నాకు అనూరాధ.

"చూశారా, మీ చిన్న కోడలు ఘనకార్యం! ఆవిడగారు శంకరం దగ్గిరికే చేరిందట... పైగా అంబాజీపేట వాళ్ళ బాబాయి గారి దగ్గర తీసుకున్న వెయ్యి రూపాయలని నన్ను ఇవ్వమని చెప్పిందట. ఎంతకు తెగించిందో చూశారా మరి ... ఇంతకీ అంబాజీపేట ఎలా వెళ్ళిందో అర్థంకావటంలేదు."

అనూరాధ ముఖంలో కోటి దీపాల కాంతి గమనించాను. ఆమెలో కోడలు శంకరం దగ్గరకు చేరిందన్న సంతోషంకంటే, జీవించే ఉందన్న ఆనందం కనిపించింది నాకు. అనవసరంగా తనని బాధపెట్టానన్న పశ్చాత్తాపం చూడగలిగాను. ఇప్పుడు తనలో ఏవిధమైన భయం, బెంగ, ఆందోళన లేదు.

"ఏమండీ! సాయంత్రం బస్సుకు రాజమండ్రి వెళ్ళి చిన్న కోడలను చూసివద్దామండీ ... పాపం ఎలా ఉందో నండీ ... అసలే నోరులేని మనిషి. ఏం అవస్థపడుతూందో ఏమిటో ... నేను సిద్ధమే. మీరూ తయారవండి" అంటూ తొందరపెట్టింది అనూరాధ నన్ను.

ఇద్దరూ బస్సులో కూర్చున్నాం. మళ్ళీ అడిగింది అనూరాధ—"కోడలు పిల్ల ఎలా వెళ్ళిపోయిందండీ" అని.

అంబాజీపేటకో ఆ భార్యాభర్తల్ని ఎందుకు కలిపావంటావ్? అవధానులు నీకు కట్నం సొమ్ము ఎలా ఇచ్చాడనుకున్నావ్? శంకరం నీకు విష్మారంగా ఎందుకు ఉత్తరాలు రాశాడు? వీటికి వెనుక ఉన్నది "నేనే" అని చెప్పలేక ఇలా. అన్నాను. కిటికీలోనుంచి బయటకు చూస్తూ—"అదే నాకూ తెలియటం లేదు." అని. ✱